
కథా నిలయంలో భద్రపరిచిన పుస్తకాలు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

పెద్దాసుపత్రి.. మందుల్లేవ్

అది జిల్లాకే పెద్దాసుపత్రి. జిల్లా నలుమూలల నుంచి నిత్యం వేలాది మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. వైద్యం కోసం అక్కడికి వస్తుంటారు. అత్యవసర చికిత్సల కోసం రిఫరల్ కేసులు కూడా ఈ ఆస్పత్రికే అధికంగా వస్తుంటాయి. అంతటి ప్రాధాన్యం గల ఆస్పత్రిలో రోగులకు మందుల కొరత వేధిస్తోంది. సాధారణ మందులు, ఇంజక్షన్లు కూడా అందుబాటులో లేకపోవడంతో.. బయట కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. తమపై ఆర్థిక భారం తప్పడం లేదని రోగుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. మరోవైపు పరికరాలు కూడా సక్రమంగా లేక వైద్యసేవలు గగనమవుతున్నాయని రోగులు వాపోతున్నారు.



- సమస్యల వలయంలో రిమ్స్
- సాధారణ ఔషధాలకూ కొరతే
- శస్త్రచికిత్సలకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకునేదెవరని రోగుల ఆవేదన

అరసవల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో మందుల కొరత కారణంగా రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే స్తోమత లేక చాలామంది ప్రజలు రిమ్స్‌కు వస్తుంటారు. కాగా.. ఇక్కడ సరైన వైద్యం అందక.. మందులు కూడా అందుబాటులో లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ ఆస్పత్రిలో 900 పడకలు ఉన్నాయి. నిత్యం వందలాది మంది వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతూ.. ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు. ఇన్‌ఫెక్షన్లు అదుపులోకి తెచ్చేందుకు అవసరమైన యాంటీ బయోటిక్స్ కూడా ఇక్కడ అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. రోగులకు అత్యంత సాధారణంగా రికమెండ్ చేసే పెంటాప్రజోల్ వంటి మందులు కూడా లేకపోవడం గమనార్హం. శస్త్రచికిత్స అనంతరం మత్తు ప్రభావం నుంచి రోగులు బయటపడేందుకు అవసరమైన "నియోస్టిగ్మిన్" ఇంజక్షన్లు కూడా సరిపడా లేవు. పాముకాటుకు సంబంధించిన ఇంజక్షన్ల కొరత వేధిస్తోంది. హైపటైటిస్-సి చికిత్సలకు సంబంధించిన మందులు కూడా పూర్తిగా అందుబాటులో లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో.. కొత్తగా మందుల సరఫరాకు సంబంధించి టెండర్లు పిలవాల్సి ఉందని వైద్యాధికారులు చెబుతున్నారు.

పట్టించుకునేదెవరు....?

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని అధికారులు, నాయకులు తరచూ సందర్శిస్తూనే ఉంటారు. కానీ రోగులకు అవసరమైన మందులు ఉన్నాయో లేదో పరిశీలించడం లేదనే విమర్శలు (మిగతా 6వ పేజీలో..)

కథ ఒంటరి 'కారా'దని..!

- 'కథా నిలయం'తో ప్రత్యేక గుర్తింపు
- నిరంతరం కథా 'యజ్ఞం'
- ఇదీ కారా మాస్టారి ప్రస్థానం


కారా మాస్టారు(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కథే ఆయన ఊపిరి. రచనలే ఆయన శ్వాస. సామాజిక స్పృహ కలిగించే కథలకు ఓ గూడు కల్పిస్తూ.. శ్రీకాకుళంలో 'కథానిలయం' పేరిట కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 18వేలకు పైగా కథల పుస్తకాలు సేకరించి.. అందులో భద్రపరిచారు. ఎంతోమంది సాహితీ ప్రియులను, యువ రచయితలను ప్రోత్సహించారు. రచయితల కోసం నిరంతరం కథా'యజ్ఞం' చేశారు. చివరి శ్వాస వరకూ కథతోనే పయనించారు. ఇదీ సుప్రసిద్ధ రచయిత కాళీపట్నం రామారావు (కారా మాస్టారు) ప్రస్థానం. శనివారం కారా మాస్టారు శతజయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

6 లో


ప్రజలను అప్రమత్తం చేస్తున్న డీఆర్‌వో రాము

సరిహద్దులో పెద్దపులి సంచారం!

ఇచ్ఛాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్టు సమాచారం అందింది. సరిహద్దు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల'ని డిప్యూటీ రేంజ్ అధికారి ఐ.రాము తెలిపారు. కాశీబుగ్గ రేంజ్ అధికారి ఏ.మురళీకృష్ణ ఆదేశాల మేరకు డీఆర్‌వో, సిబ్బంది శుక్రవారం ఇచ్ఛాపురం మండలంలోని పురుషోత్తపురం, కేదారిపురం, ముచ్చింద్ర, బెనుగానిపేటలోని పంట పొలాల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామాల్లో ప్రజలకు అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించారు. ఒంటరిగా రాత్రిపూట పొలాలకు వెల్లరాదని తెలిపారు. పశుసంపద నను కాపాడుకోవాలని సూచించారు. పులి జాడ తెలిసిన వెంటనే అటవీ శాఖ అధికారులుకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో బీట్ అధికారులు భానుమూర్తి, సురేష్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కొత్త ఖాతాల కోసం ప్రత్యేక శిబిరాలు

- పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు



అరసవల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖలో కొత్త ఖాతాల కోసం ఈ నెల 15 వరకూ ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'తపాలాశాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా.. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్(ఐపీపీబీ) ద్వారా కొత్త ఖాతాలను తెరవడం, ఆధార్ లింకేజీని సులభతరం చేయడానికి ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నాం. ఐపీపీబీ ఖాతాలకు ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) మ్యాపింగ్ సులభతరం చేయడం ప్రాథమిక లక్ష్యం. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న 3 లక్షల ఖాతాలను పునరుద్ధరిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందాలంటే ఐపీపీబీ ఖాతాలను ప్రజలు తెరవాలి' అని సూపరింటెండెంట్ హరిబాబు సూచించారు. మరింత సమాచారం కోసం సమీపంలోని పోస్టల్ కార్యాలయాలను సంప్రదించాలని తెలిపారు.

బీఈడీ, ఐటెప్ కోర్సుల సెమిస్టర్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల బీఈడీ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. ప్రత్యేక బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు వర్సిటీ కేంద్రంగా ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరగనున్నాయి. జనరల్ బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ పరీక్షలు పాలకొండ, పలాస, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు, జీసీఎస్ఆర్ కళాశాల (రాజాం), వర్సిటీలోని రెండు కేంద్రాల్లో జరగనున్నాయి. నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్య (ఐటెప్) కోర్సు రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు వర్సిటీ కేంద్రంగా నిర్వహిస్తారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- జిల్లాలో 17 నుంచి ధాన్యం సేకరణ
- రైతులకు కావాల్సిన చోటే విక్రయాలు
- ఒడిశా ధాన్యాన్ని ఇక్కడ నివారించాలి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో ఈ నెల 17 నుంచి ధాన్యం సేకరిస్తాం. రైతులు పండించే ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామ'ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. శుక్రవారం జిల్లాలో ధాన్యం కొనుగోలుపై కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమక్షంలో సమీక్ష నిర్వహించారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ 'రానున్న మూడు, నాలుగు నెలలు చాలెంజ్‌గా తీసుకుని.. రైతుల వద్ద ధాన్యం సేకరణ చేపట్టాలి. ఒడిశా నుంచి ధాన్యం రాకుండా నివారించాలి. గత ఐదేళ్లు ధాన్యం సేకరణ సక్రమంగా జరగలేదు. జిల్లాలో కొన్ని రైసుమిల్లులను పక్కన పెట్టేవారు. అటువంటివాటికి తావులేకుండా చూడాలి. ప్రైవేటు ఆర్గనైజేషన్ వారు గతంలో ఏ విధంగా సేకరించిందీ పరిశీలించాలి. మార్కెటింగ్, పీఏసీఎస్‌లు, స్వయం సహాయం సంఘాల ద్వారా సేకరణకు చర్యలు చేపట్టాలి. ధాన్యం కొనుగోలుకు నిబంధనలు ఏమీ లేవు. రైతులు ఎక్కడ కావాలంటే అక్కడే విక్రయించుకునేందుకు అవకాశం కల్పించాలి. గత ఐదేళ్లలో ఏ రైస్ మిల్లు ఎన్ని ధాన్యాన్ని సేకరించిందో ఆ వివరాలను నాకు తెలపాలి. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుంది. కొనుగోలు కేంద్రాల వద్ద సంబంధిత అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి' అని ఆదేశించారు. ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులను కోరారు. గ్రేడ్-ఏ ప్రమోట్ చేయాలన్నారు. మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. నీరందక పంటలు పండని భూ వివరాలను అందజేయాలని ఆర్డీవోలకు ఆదేశించారు. గోదాముల నిర్మాణాలపై ఆరాతీశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి కస్టోడియన్ అధికారులుగా సీఎస్‌డీటీలను నియమిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయ్ డీఎం శ్రీనివాసరావు, జిల్లా అగ్రికల్చర్ జేడీ త్రినాథస్వామి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, ఎల్‌డీఎం సూర్యకిరణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బుద్ధిమాంధ్యంతో బిడ్డ ఉన్నాడని...

- భార్య, కొడుకును వదిలించుకునేందుకు యత్నం
- భర్త ఇంటి ముందు బాధితురాలి ఆందోళన
- న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు


భర్త ఇంటి ముందు ఆందోళన చేస్తున్న కవిత

పలాస, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 'బుద్ధిమాంధ్యంతో పుట్టాడని కుమారుడ్ని.. నన్ను పుట్టింటికి పంపించేశారు. మమ్మల్ని వదిలించుకునేందుకు అత్తింటివారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మాకు న్యాయం చేయండి' అంటూ ఓ మహిళ.. తన భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. అత్తింటివారు తలుపులు తీయకపోవడంతో.. చివరకు 'మీ-కోసం' కార్యక్రమంలో ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం నగరానికి చెందిన పొట్నూరు లక్ష్మణరావు, హైమావతి కుమార్తె కవితకు 2013లో కాశీబుగ్గ (స్టేట్‌బ్యాంకు వీధి)నిత్యానందనగర్‌కు చెందిన తంగుడు హరికృష్ణతో వివాహమైంది. ఆ సమయంలో కట్నకానుకలతో పాటు బంగారు ఆభరణాలు భారీస్థాయిలో అందించారు. వీరి దాంపత్య జీవితం కొన్నాళ్లపాటు సజావుగా సాగింది. వీరికి జైశ్రీరామ్ అనే పదేళ్ల బాలుడు ఉన్నాడు. పుట్టినప్పటి నుంచీ కుమారుడు బుద్ధిమాంధ్యంతో ఉండడంతో భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు ప్రారంభమయ్యాయి. అత్తమామలు కూడా వత్తాసు పలకడంతో ఆమె పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారింది. బుద్ధిమాంధ్యంతో పుట్టిన బాలుడితో వేగలేమని.. ఎలాగైనా ఆ బాలుడితోపాటు తమ కుమార్తెను వదిలించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారని కవిత తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో మూడేళ్ల కిందట తమ కుమార్తెను పుట్టింటికి పంపించేశారని తెలిపారు.

- ఇదిలా ఉండగా భర్తే తనకు సర్వస్వమని, ఆయనతోనే జీవితమని కవిత.. శుక్రవారం మధ్యాహ్నం భర్త ఇంటికి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న అత్తవారింటివారు తలుపులు తాళాలు వేసేశారు. దీంతో కవిత, ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఇంటి బయట చాలాసేపు నిరీక్షించారు. గేటు తాళాలు విరగొట్టినా.. ఇంటి తలుపులు తీయక పోవడంతో కాసేపు ఆందోళన చేశారు. అనంతరం శుక్రవారం పలాస-కాశీబుగ్గలో నిర్వహించిన 'మీ-కోసం' కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి ఈ విషయాన్ని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. తమ కుమార్తెకు న్యాయం చేయాలని వేడుకున్నారు.
- బాధితురాలి కవితకు స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష బాసటగా నిలిచారు. కవితకు న్యాయం చేయాలని ఎస్పీ కెవి.మహేశ్వరరెడ్డిని ఆమె కోరారు. అనంతరం మీడియాతో శిరీష మాట్లాడుతూ.. బిడ్డ బుద్ధిమాంధ్యంతో పుట్టాడని విడిచిపెట్టాలని యోచించడం అన్యాయమన్నారు. బాధితురాలికి అండగా నిలుస్తామని, భర్త, అత్తమామలు ఆమెను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

అయ్యో.. కన్నా!

- ఆడుకుంటూ.. ఆర్టీసీ బస్సు కింద పడి బాలుడి మృతి


దివ్యాంశ్ ప్రధాన్(ఫైల్)

కంచిలి నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అప్పటివరకూ ఆ చిన్నారి బాలుడు ఇంట్లో ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చాడు. ఆ సమయంలో ఆర్టీసీ బస్సు వెళ్తుండగా.. వెనుక చక్రాల కింద పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చాడు. కంచిలి మండలం ముండల గ్రామంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముండల గ్రామానికి చెందిన రెండున్నరేళ్ల దివ్యాంశ్ ప్రధాన్.. శుక్రవారం ఆర్టీసీ బస్సు వెనుక చక్రం కింద పడి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఒడిశా రాష్ట్రం జక్కర గ్రామానికి చెందిన బసంత్ ప్రధాన్‌కు, కంచిలి మండలం ముండల గ్రామానికి చెందిన సంగీతతో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. ఈ దంపతులు ఇద్దరు కుమారులు. ఉపాధి కోసం బసంత్.. విదేశాలకు వలస వెళ్లాడు. దీంతో సంగీత తన ఇద్దరి కుమారులతో కలిసి ముండల గ్రామంలో కన్నవారింట వద్ద నివసిస్తోంది. శుక్రవారం ఉదయం చిన్న కుమారుడు దివ్యాంశ్ ప్రధాన్ ఇంట్లో ఆడుకుంటూ వీధిలోకి వచ్చాడు. ఆ విషయాన్ని కుటుంబ సభ్యులెవరూ గమనించలేదు. కాగా.. అదే సమయంలో అటుగా ఆర్టీసీ బస్సు వెళ్లగా.. వెనుక చక్రం కింద పడి దివ్యాంశ్ ప్రధాన్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బాలుడు బస్సు కిందకు వచ్చిన విషయాన్ని డ్రైవర్ కూడా గమనించకపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. చక్రాల కింద పడి నలిగి.. బాలుడు ప్రాణాలు కోల్పోవడంతో స్థానికులు పెద్దగా కేకలు వేశారు. దీంతో డ్రైవర్ బస్సును నిలిపేశాడు. బాలుడ మృతదేహాన్ని చూసి తల్లి, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అప్పటి వరకు ఆడుకుంటూ, అల్లరి చేసిన కొడుకు.. ఇలా తిరిగిరాని లోకాలకు పోయాడంటూ ఆ కన్నతల్లి రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కంచిలి ఎస్ఐ రాజేష్ తెలిపారు.


మృతిచెందిన ఆవు వద్ద.. రైతు మల్లేసు విచారం(ఫైల్)

మూడేళ్లుగా అందని పశుబీమా

6 లో

ఉపాధిహామీ నిధులు పక్కదారి

- క్షేత్ర సహాయకులకు షోకాజ్ నోటీసులు

ఆమదాలవలస, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మండలంలో ఉపాధిహామీ నిధులు పక్కదారి పట్టాయి. ఈ నేపథ్యంలో నెల్లిపర్తి, వంజంగి గ్రామాలకు చెందిన ఉపాధిహామీ క్షేత్రసహాయకులు మానుకొండ మురళీధర్, పూజారి సతీష్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఏపీవో సురవరపు లక్ష్మీనరసమ్మ తెలిపారు. నెల్లిపర్తిలోని ఉపాధిహామీ క్షేత్రసహాయకుడు మానుకొండ మురళీధర్ రూ.4లక్షలకుపైగా నిధులు అవకతవకలకు పాల్పడినట్టు సామాజిక తనిఖీలో తేలిందన్నారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన సభకు, మండలంలోని సామాజిక తనిఖీ సభకు క్షేత్రసహాయకుడు హాజరుకాలేదని తెలిపారు. అలాగే వంజంగి గ్రామానికి చెందిన పూజారి సతీష్ రూ.1,85,000 మేర అవకతవకలకు పాల్పడినట్టు సామాజిక తనిఖీ బృందం గుర్తించిందన్నారు. వీరిద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఏపీవో లక్ష్మీనరసమ్మ తెలిపారు.



కథ ఒంటరి కారాదని..!

- 'కథా నిలయం'తో ప్రత్యేక గుర్తింపు
- రచయితల కోసం నిరంతరం కథా 'యజ్ఞం'
- ఇదీ కారా మాస్టారి ప్రస్థానం
- కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం
- నేడు శతజయంతి

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మనం కథలు చదువుతున్నాం. అక్కడితో ఆ కథల పుస్తకాన్నో... అది ప్రచురితమైన పత్రికనో వదిలేస్తున్నాం. కానీ అక్షరాలను... తెలుగు కథను ప్రేమించిన ఆ వ్యక్తి ఆ కథకు తోడుగా ఉండాలనుకున్నాడు. దానికి గూడునివ్వాలనుకున్నాడు. తద్వారా భావితరాలకు మన కథా వైభవాన్ని పరిచయం చేయాలనుకున్నాడు. ఆయనే కాళీపట్నం రామారావు మాస్టారు. 'కారా'గా ప్రపంచమంతటికీ సుపరిచితులైన ఆయన ఆలోచనలకు రూపమే 'కథా నిలయం.' కథకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కారా మాస్టారు శత జయంతి సందర్భంగా ఆయన ప్రస్థానాన్ని మననం చేసుకుందాం.

మురపాకలో పుట్టి..

'కథలు కంచికి చేరడం కాదు... కథా నిలయానికి చేరాలి' అని భావించే కారా మాస్టారు మురపాకలో 1924 నవంబరు 9న జన్మించారు. తల్లిదండ్రులు పేర్రాజు, భ్రమరాంబ. విశాఖ జిల్లా భీమిలిలో ఉపాధ్యాయ శిక్షణ పొంది... అక్కడి సెయింట్ ఆంథోని పాఠశాలలో లెక్కల మాస్టారుగా విధులు నిర్వహించారు. ఆ సమయంలోనే కథా రచనకు శ్రీకారం చుట్టారు. ఆయన యుక్తవయసులో అంటే 1943లో 'చిత్రగుప్త' అనే పత్రికలో 'ప్లాట్‌ఫారం' అనే కార్డు కథ ప్రచురితమైంది అప్పటి నుంచి చివరి శ్వాస వరకు ఆయన కథా'యజ్ఞం' కొనసాగింది.

'యజ్ఞం'తో ప్రత్యేక గుర్తింపు

కారా మాస్టారు కథలన్నీ ఒక ఎత్తు. 'యజ్ఞం' ఒక ఎత్తు. తొమ్మిది కథల 'యజ్ఞం' సంపుటి 1996లో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారానికి ఎంపికైంది. ఆయన కలం నుంచి మొత్తం 64 రచనలు జాలువారాయి. ఎందరో రచయితలు...ఎన్నో కథలు రాస్తున్నా... అవి తరువాత తరాలకు అందించే ప్రక్రియ ఎక్కడా జరుగు తున్నట్టు లేదనే వేదన ఆయనను వెంటాడేది. తెలుగు సాహితీ వేత్తలు, రచయితల కథలన్నీ ఒకచోట ఉండాల నేది ఆయన ఆకాంక్ష. ఈ క్రమం లోనే 'కథా నిలయం' స్థాపించాలనే ఆలోచనకు అంకురార్పణ జరిగింది. కొంతమంది స్నేహితులతో సమాలోచన చేసి శ్రీకాకుళం నగరంలోని విశాఖ -ఎ కాలనీలో 'కథా నిలయం' స్థాపించారు.

18వేలకు పైగా పుస్తకాలు

కారా మాస్టారి కథానిలయంలో 500కు పైగా కవులు, రచయితల ఫొటోల గ్యాలరీ, వారు రచించిన అపురూప గ్రంథాలను భద్రపరిచారు. వాటిని కంప్యూటీకరణ చేయించారు. దీనిలో 18 వేలకు పైగా కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. యువ రచయితలకు ఇది ఓ పరిశోధనా గ్రంథాలయంగా మారిందనడంలో సందేహం లేదు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 14, 15 తేదీలలో కథానిలయం వార్షికోత్సవ సభలు నిర్వహిస్తూ ఉంటారు. ఆయన రచించిన యజ్ఞం, అభిమానాలు, తీర్పు, హింస, మహదాశీర్వచనం, రాగమయి, చావు, నో రూమ్, స్నేహం, ప్లాట్‌పారం, వీరుడు, మహావీరుడు, శాంతి వంటి కథలు ఎంతగానో ప్రాచుర్యం పొందాయి. ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారంతో పాటు, రాష్ట్ర సాంస్కృతిక మండలి హంస అవార్డు, లోక సమ్మాన్, గురజాడ ప్రతిభ అవార్డు, ధర్మనిధి పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం డాక్టరేట్, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం లభించాయి. కథానిలయం స్థాపనతో ఆయన ప్రత్యేక గుర్తింపు సాధించారు. 2021 జూన్ 4న కన్నుమూసే వరకూ కారా మాస్టారు కథతోనే పయనించారు.



కలం పేర్లు ఆయన సూచనే



కారా మాస్టారితో నా అనుబంధం సుమారు నలభై ఏళ్లు. నేను మొదట్లో విప్లవ కథలు రాసేవాడిని. వాటితో పాటు కళింగాంధ్ర సామాజిక స్థితిగతులను రాసేవాడిని. అవే కారా మాస్టారుతో అనుబంధానికి కారణమయ్యాయి. నా తొలి కథాసంపుటి 'పోడు-పోరు' వెనుక మాస్టారి ప్రోత్సాహం ఉంది. విప్లవ కథలు రాసే సమయంలో అపూర్వ, అరుణ, వరినీయా అనే కలం పేర్లు పెట్టుకోవడానికి కారణం ఆయనే. 'ఆహ్వానం' అనే పత్రికలో ప్రత్యామ్నాయం అనే కథ నా పేరుతో వచ్చాక... కలం పేరును వదిలేయమన్నారు. అనేక కథలను నేను ఆయనతో తొలుత చదివించి...ఆ తరువాత పత్రికలకు పంపేవాడిని. శ్రీకాకుళంలో కథానిలయం నిర్మాణానికి... మాస్టారు శ్రీకాకుళం రావడానికి నేను కొంత సహకరించాను.

– అట్టాడ అప్పలనాయుడు, రచయిత

18 ఏళ్లు కలిసి నడిచా



మాస్టారుతో కలసి కథానిలయంలో సుమారు 18 ఏళ్ల పనిచేశాను. ఆయన కన్నుమూయడానికి కొన్ని రోజుల ముందు పలక మీద బలపంతో 'కథానిలయాన్ని వీలైనంత సంరక్షించండి' అని రాశారు. దీన్ని బట్టి కథా నిలయాన్ని ఆయన ఎంతగా ప్రేమించేవారో అర్థం చేసుకోవచ్చు. నా కథా సంపుటి 'అల్పపీడనం' ను 2020లో వారి ఇంటి వద్ద ఆయనే ఆవిష్కరించారు. కారా మాస్టారు అజాతశత్రువు.

– దాసరి రామచంద్రరావు, రచయిత

ఆమె వయస్సు 99 వంశ వృక్షం

- 14 మంది సంతానం.. మనుమలు, మనవరాళ్లు
- వారికీ వివాహాలై మునిమనమలు.. మనవరాళ్లు
- సంతానలక్ష్మిగా చీమలవలసలో గుర్తింపు

ఆమదాలవలస, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చీమలవలస గ్రామానికి చెందిన 99 సంవత్సరాల సనపల అన్నపూర్ణమ్మకు సంతాన లక్ష్మిగా పేరుంది. ఈమెకు పది మంది మగబిడ్డలు, నలుగురు ఆడబిడ్డలు. అన్నపూర్ణమ్మ ఈ వయస్సులో కూడా వృద్ధాప్య సమస్య తప్ప ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా జీవిస్తోంది. ఈమె సంతానంలో ఒక బాలిక బాల్యంలోనే అనారోగ్యంతో మరణించగా.. నేడు పది మంది కొడుకులు, ముగ్గురు కూతుళ్లకు వివాహాలు జరిగి వారంతా అన్నపూర్ణమ్మను చక్కగా చూసుకుంటున్నారు. రైతు కుటుంబానికి చెందిన అన్నపూర్ణమ్మ భర్త గోపాలరావు అనారోగ్యం కారణంగా 2015 సంవత్సరంలో మరణించారు. ఈమె కుమారులు ముగ్గురు రైతులు కాగా నలుగురు వివిధ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఒక కుమారుడు గతంలో సర్పంచ్‌గా చేయగా, మరో కుమారుడు సనపల చెల్లంనాయుడు ప్రస్తుతం చీమలవలస సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఆఖరి కుమారుడు సూర్యచంద్రకిరణ్ ప్రస్తుతం ఆమదాలవలసలో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ముగ్గురు కుమార్తెలకు వివాహాలు జరిగి వారి గ్రామాల్లో నివసిస్తుండగా.. ఈ 13 మంది సంతానానికి 19 మంది మగపిల్లలు, 12 మంది ఆడపిల్లలు ఉన్నారు. అన్నపూర్ణమ్మ మనుమలు, మనుమరాళ్లకు కూడా వివాహాలై వారి సంతానంతో కలిపి ఏకంగా 99 మందితో వంశ వృక్షంగా తయారయ్యారు.



అన్నపూర్ణమ్మ

నాటి ఆహార అలవాట్లే..

అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ.. 'అప్పటి కాలంలో తీసుకున్న ఆహారపు అలవాట్లే ప్రస్తుతం తన ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతున్నాయి. అంతేకాకుండా అప్పట్లో గర్భిణిగా, బాలింత సమయంలో ఇంగ్లీష్ మందులు కాకుండా వివిధ రకాల వనమూలికలు, బెల్లంతో తయారు చేసిన కాయకం వంట పదార్థాలను తినిపించేవారు. వాటివల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు నా దరి చేరలేదు. రాగిపిండి అంబలి, ఊదల అన్నం, బెల్లంతో ఆవుపాల టీ, పెరట్లో పండించిన కూరగాయల ఆహారాలే అప్పట్లో తీసుకునేవాళ్లం' అన్నారు. 'అప్పట్లో గ్రామంలో ఎలాంటి శుభకార్యాలు జరిగినా అప్యాయతలు, అనురాగాలతో నిర్వహించేవారు. అధిక సంతానం కలిగిన నన్ను ప్రత్యేకంగా గుర్తించి శుభసూచికంగా ఇళ్లలో జరిగే శుభకార్యాలకు ఆహ్వానించేవారు. ఇది నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చేది' అని ఆమె అన్నారు.



తల్లికి సపర్యలు చేస్తున్న కుమారుడు



భర్త, 13 మంది పిల్లలతో అన్నపూర్ణమ్మ

పెద్దాసుపత్రి.. మందుల్లేవ్

(ఐదో పేజీ తరువాయి)

ఉన్నాయి. ప్రభుత్వ వైద్యం.. దైవాదీనంగా మారుతోందని వాపోతున్నారు. శస్త్ర చికిత్సలు ఎక్కువగా చేయాలని, అత్యవసర సేవలు నిరంతరాయంగా అందించాలని, ఎటువంటి ఫిర్యాదులకు తావు లేదని, ఉన్నతాధికారులు ఓ వైపు హెచ్చరికలు చేస్తుంటారు. మరి మందులే సరిగా అందుబాటులో లేకుంటే పూర్తిస్థాయి చికిత్సలు ఎలా సాధ్యపడుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. అలాగే ఆపరేషన్ థియేటర్లలో ఏసీలు సరిగా పనిచేయడం లేదు. అసలే మాడ్యులర్ తరహా థియేటర్లు కావడంతో వైద్యులు శస్త్రచికిత్సల సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారు. కొద్ది రోజుల కిందట జరిగిన ఆస్పత్రి సమావేశంలో మందుల కొరతపై చర్చ జరిగింది. మరికొద్ది రోజులు సర్దుకుపోవాలని ఆస్పత్రి అధికారులు వైద్యులకు సూచించడం గమనార్హం.

సమస్యల వలయంలో...

సర్వజన ఆస్పత్రికి మందుల కొరతతోపాటు వివిధ సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ ఏడాదికి వైద్య విద్యకు సంబంధించి రిమ్స్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 200కు చేరుకుంది. కానీ పెంచిన సీట్లకు సరిపడా మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు విఫలమయ్యారు. ఒకే హాస్టల్ గదిలో ముగ్గురు లేదా నలుగురు వైద్య విద్యార్థులు ఉండాల్సిన పరిస్థితి. దేశంలోని దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు ఇక్కడకు వైద్యవిద్యను అభ్యసించడానికి వస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తమ పిల్లలు ఎలా వైద్యవిద్యను అభ్యసిస్తారని వారు అధికారులను పలుమార్లు నిలదీశారు. అయినా పరిస్థితుల్లో ఎటువంటి మార్పు రాలేదు.

వెంటిలేటర్లను సర్దుబాటు చేస్తే..

గతంలో కొవిడ్ సమయంలో అత్యవసర సేవలందించేకు వెంటిలేటర్లను ఆసుపత్రికి పెద్ద సంఖ్యలో సరఫరా చేశారు. ఇప్పుడు వాటిని వినియోగించకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. సుమారు 80 శాతం వరకు పాడయ్యాయి. వాటికి మరమ్మతులు చేయించి.. జిల్లాలోని సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు సర్దుబాటు చేస్తే వందలాది మంది ప్రాణాలు కాపాడుకోవచ్చు. కానీ అధికారులు, నాయకులు ఆ దిశగా శ్రద్ధ చూపడం లేదు.

ఫిజియోథెరపీ సెంటర్లో పరికరాలేవీ?

రిమ్స్‌లోని ఫిజియోథెరపీ సెంటర్‌లో ఎటువంటి పరికరాలు అందుబాటులో లేక వెలవెలబోతోంది. నరాల వ్యాధులు, ఎముకల చికిత్సల కోసం రోజుకు కనీసం 40 మంది వరకు ఈ సెంటర్‌కు వస్తారు. కేవలం రూ.3లక్షలతో ఈ సెంటర్‌కు కావలసిన పరికరాలను అందుబాటులోకి తేవచ్చు. ఈ కేంద్రంలో నలుగురు సిబ్బంది ఉన్నా.. పరికరాలు లేకపోవడంతో వారు రోగులకు ఏదో తూతూమంత్రంగా సూచనలు చేస్తూ నెట్టుకొస్తున్నారు. ప్రమాదాలకు గురైన రోగులు సాధారణ స్థాయికి చేరుకోవాలంటే నెలల కొద్దీ ఫిజియోథెరపీ చికిత్సలు అవసరం. దాతలైనా స్పందిస్తే.. ఈ సెంటర్ ద్వారా పూర్తిస్థాయి సేవలను అందించవచ్చు.

నర్సింగ్ సిబ్బంది కొరత..

900 పడకల ఆస్పత్రిలో ఎంఎన్‌వోలు 90 మంది అవసరం కాగా.. కేవలం 23 మంది మాత్రమే ఉన్నారు. దీంతో సేవలు సక్రమంగా అందడం లేదు. కనీసం ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఈ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు, నాయకులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోతోంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి.. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు. పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మందుల కొరత నిజమే

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మందుల కొరత నిజమే. ఈ సమస్య వారం రోజుల్లో పరిష్కారమవుతుంది. ప్రస్తుతం ఏపీఎంఎస్ఐడీసీ నుంచి మందుల సరఫరా జరుగడం లేదు. లోకల్ కొనుగోళ్లు చేసేందుకు కూడా అవకాశం లేకుండా 2022లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కేవలం కృష్ణా ఫార్మసీ నుంచి మాత్రమే కొనుగోళ్లు చేయాలని నిబంధన ఉండేది. కానీ ఆ కంపెనీపై ఆరోపణలతో సరఫరా ఆగిపోయింది. సమస్యలను అధిగమించి త్వరలో మందుల సరఫరా చేస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

– డాక్టర్ సుభాషిణి, ఆర్ఎంవో

రసపట్టులో రంజీ మ్యాచ్

- ఆంధ్రా ముందు 320 పరుగుల లక్ష్యం

విజయనగరం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా - ఉత్తరాఖండ్ జట్ల మధ్య రంజీ ట్రోఫీ గ్రూప్-డి మ్యాచ్ రసవత్తరంగా సాగుతోంది. ఆంధ్రా జట్టు ముందు ఉత్తరాఖండ్ జట్టు భారీ లక్ష్యాన్ని ఉంచింది. 321 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు ఆదిలోనే వికెట్ కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. ఇప్పటికే పిచ్ బౌలర్లకు సహకరిస్తోంది. ఆట మరో రోజు మిగిలిఉండగా చేతిలో 9 వికెట్లు ఉన్నా.. ఉత్తరాఖండ్ జట్టు బౌలర్లను ఎదురొడ్డి ఆంధ్రా నిలుస్తుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

డాక్టర్ వీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రికెట్ మైదానం పిచ్ బౌలర్లకు సహరిస్తుండడంతో బ్యాటర్లు చెమటోడ్చుతున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో 338 పరుగులు చేసిన ఉత్తరాఖండ్ జట్టు.. ఆంధ్రా జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 146 స్వల్ప స్కోరుకే పరిమితం చేసి 192 భారీ ఆధిక్యాన్ని సాధించింది. శుక్రవారం మూడో రోజు 92/4 ఓవర్ నైట్ స్కోర్‌తో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు బ్యాటర్లను పర్యాటక జట్టు బౌలర్లు ఏదశలోనూ కోలుకోనివ్వలేదు. రెండోరోజు స్కోర్‌కు 54 పరుగులే జోడించి ఆంధ్రా జట్టు ఆలౌటైంది. సీనియర్ బ్యాటర్ హనుమ విహారి 43 పరుగులు చేసి అవుట్ కాగా, మిగతా వారు స్వల్ప స్కోర్‌కే పరిమితమయ్యారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఉత్తరాఖండ్ జట్టు.. ఆంధ్రా జట్టు బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లు కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం భారీగా ఉండటంతో జట్టు కెప్టెన్ 128/9 పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసి ఆంధ్రా ముందు 321 పరుగుల లక్ష్యాన్ని ఉంచారు. ఆంధ్రా ఫాస్ట్ బౌలర్లు స్టీఫెన్, కేవీ శశికాంత్ మూడేసి వికెట్లు సాధించగా, లలిత్‌మోహన్ రెండు, పీవీఎస్ఎన్ రాజు ఒక వికెట్ సాధించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4.1 ఓవర్లలో వికెట్ నష్టపోయి 8 పరుగులు చేసింది. శనివారం ఆటకు ఆఖరు రోజు కావడంతో 90 ఓవర్లు ఆడాల్సి ఉంది. జట్టు భారమంతా కెప్టెన్ రషీద్, సీనియర్ బ్యాటర్లు హనుమవిహారి, కె.ఎస్.భరత్‌పైనే ఉంది.



ఉత్సాహంగా సాగుతున్న మ్యాచ్

రహదారి భద్రత.. జీవితానికి రక్షణ

- నిబంధనలు కఠినంగా అమలు చేయాలి
- నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రతే.. జీవితాలకు రక్షణగా నిలుస్తుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారి భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు మరింత కఠినతరం చేయాలని ఆదేశించారు. శ్రీకాకుళం నుంచి నరసన్నపేట వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఇకపై తమ్మినాయుడు పేట వైపు రాంగ్ రూట్‌లో వెళ్లరాదని హెచ్చరించారు. సర్వీసు రోడ్డులో వెళ్లాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఆర్టీసీ బస్సులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్లలోను, 158 సున్నిత ప్రాంతాల్లోను చేపట్టిన రక్షణ చర్యలపై చర్చించారు. నవభారత్ జంక్షన్ వద్ద అధికారులు పర్యటించి విస్తరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని, నిర్లక్ష్యంగా ఉంటే సంబంధిత అధికారులపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదాలు జరిగిన సమయాల్లో వైద్యసేవలు సకాలంలో అందేలా వైద్యారోగ్యశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. 1033 హెల్ప్‌లైన్ బోర్డులను తెలుగులో ఏర్పాటు చేయాలని, కాల్ సెంటర్లలో తెలుగు మాట్లాడేవారిని నియమించాలని, మలుపుల వద్ద బ్యారికేడ్స్, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఇందులో పట్టణప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు భాగస్వామ్యం కావాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై జరిమానాలు విధించి, కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, డీటీసీ విజయసారథి, ఆర్ అండ్ బీ ఎస్ఈ సుధాకర్, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, డీపీవో భారతి సౌజన్య, ఆర్డీవోలు కృష్ణమూర్తి, సాయి ప్రత్యూష, ఎంవీఐ గంగాధర్, హైవే అథారిటీ పీడీ తివారీ, ట్రాఫిక్, పోలీసు, రవాణాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అందని పశుబీమా

- మూడేళ్లుగా పాడిరైతుల నిరీక్షణ
- 4,693 మందికి రూ.13.42కోట్ల బకాయి
- మోసం చేసిన వైసీపీ సర్కారు

టెక్కలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):

- టెక్కలి మండలం నర్సింగపల్లి పంచాయతీ కొల్లివలస గ్రామానికి చెందిన బిల్లింగి మల్లేసు అనే పాడిరైతుకు చెందిన ఆవు 2021 ఏప్రిల్ 18న చనిపోయింది. వెనువెంటనే ఆ రైతు సచివాలయ పరిధిలోని గ్రామీణ పశు సహాయకురాలుకు సమాచారం ఇచ్చారు. అధికారులు బీమాకు అవసరమైన తంతును పూర్తిచేశారు. మూడున్నరేళ్లు దాటింది. మల్లేసు తన బ్యాంకుఖాతాలో పశుబీమా నగదు అందిందా? లేదా? అని తెలుసుకునేందుకు బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారు.
- 2021-24 మధ్యకాలంలో వైసీపీ ప్రభుత్వం పాడిరైతులకు వైఎస్ఆర్ పశు నష్టపరిహారం అందజేయడంలో నిలువునా మోసం చేసింది. ఫలితంగా జిల్లాలో 4,693 మంది పాడిరైతులకు రూ.13,42,52,500 బకాయి పడింది. ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేసి చివరికి పాడిరైతులను నిలువునా ముంచింది.

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ వైఎస్ఆర్ పశు నష్టపరిహారం అందిస్తామని ప్రకటించింది. నాటు ఆవుకు రూ.15వేలు, జెర్సీ, హెచ్ఎఫ్ రకం ఆవుకు రూ.30వేలు అని చెప్పింది. అయితే 2019-21 మధ్యకాలంలో చనిపోయిన సంబంధిత పాడిరైతుల ఆవులకు సుమారు రూ.14కోట్లు చెల్లించింది. ఆ తరువాత 2021-24 మధ్యకాలానికి చెల్లింపులు ఆగిపోయాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పాడిరైతులకు పశునష్టపరిహారం చెల్లిస్తామంటూ మంత్రులు, ప్రజాప్రతినిధులు హామీలు గుప్పించి చివరికి నట్టేట ముంచారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. పశు నష్టపరిహారం చెల్లింపులు ఏమయ్యాయని పశుసంవర్థకశాఖ అధికారులను పాడిరైతులు ప్రశ్నిస్తుంటే.. తమ చేతిలో ఏమీలేదని వారు చేతులెత్తేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఉసూరుమంటూ వెనక్కి వెళ్లిపోతున్నారు. ఈ వ్యవహారంపై పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జయరాజ్‌ను వివరణ కోరగా.. పాతవి పెండింగ్‌లో ఉండిపోయాయని, ఎప్పుడు వచ్చేది చెప్పలేమని తెలిపారు.



న్యూస్ బాక్స్

ఆత్మరక్షణ విద్య అవసరం

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ విద్యతోనే మహిళల్లో ఆత్మస్థైర్యం కలుగుతుందని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పెంకి సురేఖ అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలోని సిల్వర్ జూబ్లీ హాల్లో ఆత్మరక్షణ విద్యపై శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్.హర్షిత, ఎస్.అరుణ కుమారి, శిక్షకుడు కొమర బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేంద్ర గ్రంథాలయంలో 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష కార్యక్రమం నిర్వహించారు.

డిగ్రీ కళాశాలలో నాక్ బృందం పర్యటన

ఆమదాలవలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6, 7 తేదీల్లో నాక్ బృందం పర్యటించినట్టు ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.ఎన్.స్వామి తెలిపారు. పాఠ్యాంశాలు, టీచింగ్ లెర్నింగ్ పద్ధతులు, తదితర అంశాలను బృందం పరిశీలించిందని తెలిపారు.

జిల్లాలో గ్లోబల్ విద్యా సంస్థల ఏర్పాటు



మాట్లాడుతున్న ప్రసాదరావు

గుజరాతీపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు విద్యారంగలో సేవలు అందించడానికి 2025-26లో గ్లోబల్ జూనియర్ కాలేజ్ డే, రెసిడెన్షియల్ క్యాంపులను జిల్లాలో స్థాపిస్తున్నట్లు డైరెక్టర్ ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాదిలో ఐఐటీ, నీట్ ర్యాంకులు వచ్చేవిధంగా విద్యార్థులను తయారు చేయడమే గ్లోబల్ విద్యా సంస్థల లక్ష్యమన్నారు. కెమిస్ట్రీ ప్రసాద్ ఆధ్వర్యంలో అకడమిక్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

బాలలను పనుల్లో పెడితే కేసులు

ఇచ్ఛాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాలలను పనుల్లో పెడితే షాపుల యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఏఎల్‌ఓ విజయ్‌కుమార్ హెచ్చరించారు. మున్సిపాల్టీ పరిధిలోని వివిధ షాపుల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. అనంతరం చైల్డ్ యాక్ట్ గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీపీఎస్ మీనాక్షి, చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ ఎస్.వైకుంఠరావు, బ్రెడ్స్ మండల కోఆర్డినేటర్ స్వాతి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏపీఎంగా ప్రసాద్

ఇచ్ఛాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మండల పరిషత్ ఇంచార్జ్ ఏపీఎంగా సనపల ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల బలోపేతానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు.

కార్యాలయమా?.. పార్కింగ్ స్థలమా?



ఈ చిత్రంలో కనిపిస్తున్నది వాహనాల పార్కింగ్ స్థలం అనుకుంటే పొరబడినట్లే. ఇది శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం. దీని ఎదురు గానే ఆర్టీసీ కాంప్లెక్స్, పక్కనే ఓ బార్ అండ్ రెస్టారెంట్ ఉంది. ఈ కార్యాలయం గేటు నాలుగేళ్ల కిందట విరిగిపోయింది. సుమారు ముగ్గురు తహ సీల్దార్లు మారినా గేటు మాత్రం నిర్మించలేదు. దీంతో కార్యాలయానికి వచ్చే వారితోపాటు ఇతర ప్రాంతాలకు బస్సుల్లో వెళ్లే వారు, మద్యం తాగేందుకు బార్‌లోకి వెళ్లే వారు తమ వాహనా లను ఇక్కడే పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల తహసీల్దార్ వాహనం కూడా లోపలకు వెళ్లేందుకు అవకాశం లేకుండాపోతుంది. ఇక్కడ వాహనాలను పార్కింగ్ చేయెుద్దంటే మందుబాబు లు దాడికి పాల్పడుతున్నారని రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గేటును ఏర్పాటు చేయడంతో పాటు కూలిన గోడను నిర్మించి పార్కింగ్ గోలను తప్పించాలని వారు కోరుతున్నారు.

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి)

నవోదయ గడువు పెంపు

సరుబుజ్జిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెన్నెలవలస నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 9, 11 తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశానికి ఈ నెల 19 వరకు గడువు పెంచినట్టు ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో నవోదయ వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉత్తమ అధ్యాపకునిగా మురళీకృష్ణ

ఎచ్చెర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న డి.మురళీకృష్ణ రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. సీనియర్ అధ్యాపకుని విభాగంలో ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మురళీకృష్ణను ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామయ్య, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

మత్తు రహిత జిల్లాగా మారుద్దాం: కలెక్టర్



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి. చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించి మత్తు పదార్థాల రహిత జిల్లాగా మారుద్దామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే వాటి వినియోగాన్ని రూపుమాపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఎస్పీ మహేశ్వరరెడ్డితో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా గంజాయి, ఇతర డ్రగ్స్ వాడకాన్ని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. తొలుత ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించి ఈ ఏడాది ఇప్పటి వరకు 37 కేసులు నమోదు చేశామని తెలిపారు. 108 మందిని అరెస్టు చేయగా, అందులో ఇద్దరు విద్యార్థులు ఉన్నారని తెలిపారు. గంజాయి విక్రయాలు, వినియోగాన్ని నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విక్రయిస్తున్న వారిపై సస్పెక్ట్ రౌడీషీట్, రౌడీ షీట్ తెరిచామన్నారు. యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి సంకల్పం పేరిట కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మానవ అక్రమ రవాణా వివరాలను తెలుపుతూ ఇప్పటివరకు 73 మంది పిల్లలను అక్రమ రవాణా నుంచి కాపాడగలిగామని వెల్లడించారు. వారిలో 68 మందిని తల్లిదండ్రుల వద్దకు చేరవేశామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, ఫిర్యాదుల నమోదు, డి అడిక్షన్ కేంద్రాల సేవలకు టోల్‌ఫ్రీ నెంబర్ 14446 ఉందని తెలిపారు. రిమ్స్ ఆసుపత్రిలో పూర్తిస్థాయి డి-అడిక్షన్ సెంటర్‌ను నిర్వహించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామన్నారు. విశాఖపట్నం నుంచి సమావేశానికి హాజరైన డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ పూజా పుండ్కర్ మాట్లాడుతూ స్మగ్లింగ్ నివారణకు పూర్తిస్థాయి వ్యూహం రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, డీఎస్పీలు వివేకానంద, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీపీవో భారతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ప్రయోజనం



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ రజని

ఎచ్చెర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికా బద్ధంగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో ఆంగ్ల విభాగం శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌తో పాటు కంప్యూటర్ విజ్ఞానం, సమకాలీన అంశాలపై పట్టు సాధించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ, ఆంగ్ల విభాగం సమన్వయకర్త డాక్టర్ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటు ప్రారంభం

వర్సిటీలో విద్యార్థులు, ఉద్యోగుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రం (ఆర్వో ప్లాంట్)ను వీసీ ప్రారంభించారు. నీటిని వృథా చేయొద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

పల్లెల అభివృద్ధికి కట్టుబడి ఉంటాం: ఎమ్మెల్యే



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి కట్టుబడి అభివృద్ధి పనులు చేపడుతోందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పల్లెలను పూర్తిగా విస్మరించిందని.. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అభివృద్ధి జరగక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆయన ఆరోపించారు. పాత్రునివలసలో రూ.52 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు పనులకు గొండు శంకర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులను చేస్తున్నామన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం



రొట్టవలస ఎగువ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ ముందుకు వెళుతున్నారని మండల తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు తెలిపారు. రొట్టవలస ఎగువ ప్రాంత భూములకు వంశధార కుడి కాలువ నీటిని అందించేందుకు డీఈ కామరాజు, ఏఈ పి.శ్రీనివాసులతో ఎమ్మెల్యే సర్వే చేయించడంపై ఆనందం వ్యక్తం చేశారు. వంశధార కాలువ నుంచి వెయ్యి మీటర్లు పైపులు ఏర్పాటు చేస్తే వంద ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు తొత్తడి వైకుంఠరావు, దొనకొండ దాలినాయుడు, బెవర లక్ష్మణరావులకు తెలియజేశారని వెల్లడించారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈశ్వరరావు తదితరులు

రణస్థలం, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి): జగన్నాథ స్వామి రథయాత్ర వేడుకలు శ్రీ కృష్ణ చైతన్య మఠం గోసేవ ఆశ్రమ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు యాత్రను ప్రారంభించారు. రామతీర్థం జంక్షన్ నుంచి పాత పెట్రోల్ బంకు వరకూ జాతీయ రహదారిపై జగన్నాథ స్వామి రథయాత్ర జరిగింది. జగన్నాథ, బలభద్ర, సుభద్రలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా శనివారం కోష్ట సమీపాన ఉన్న గోశాల వద్ద జరగనున్న గోపాష్టమి వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని గోసేవ స్వాములు కోరారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

ఆమదాలవలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస నియోజకవర్గంలో ఇరిగేషన్, రహదారుల పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టు స్థానిక టీడీపీ నాయకులు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. నారాయణపురం కాలువల అభివృద్ధి పనులకు రూ.19 లక్షలు మంజూరైనట్టు వివరించారు. అలాగే కళింగపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం రహదారి ఆధునికీకరణ పనుల సర్వే నిమిత్తం రూ.పది కోట్లు కేటాయించడం పట్ల సీఎం చంద్రబాబు, మంత్రులు నిమ్మల రామానాయుడు, బి.సి.జనార్దనరెడ్డికి ఎమ్మెల్యే రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు అధిగమిస్తేనే రాణింపు



నాగేశ్వరరావును సత్కరిస్తున్న బొల్లినేని సీఈవో

గుజరాతీపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఆర్ మేనేజర్లకు ఎదురయ్యే సమస్యలను సులువుగా అధిగమించిన నాడే వారు రాణించగలరని నేవల్ డాక్ యార్డ్ హెచ్‌ఆర్ మేనేజర్ కమాండర్ అర్జున్ రాధాకృష్ణ అన్నారు. హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో బొల్లినేని మెడ్ స్కిల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌ఆర్ లీడర్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీ మీద అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎల్జీజీ దక్షిణాసియా మాజీ సీఎఫ్‌వో గిరిధరన్ మాట్లాడుతూ మానవ వనరుల అభివృద్ధిలో మేనేజర్లు కీలక పాత్ర వహిస్తారన్నారు. బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్థల అవసరాల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల నైపుణ్య శిక్షణ విద్యార్థులకు ఉచితంగా అందించి ఉద్యోగాలు కల్పించామన్నారు. అనంతరం నాగేశ్వరరావును ఎస్‌డీఐ సిఈవో ఇంతియాజ్ అర్షద్ దుశ్శాలువాతో సన్మానించారు.

భాషపై ఆసక్తి అవసరం

గుజరాతీపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు భాషపై ఆసక్తి కలిగి ఉండాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ అన్నారు. నగరంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు భాష ఉచ్చారణలో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ తిరుమల చైతన్య, రాష్ట్ర పరిశీలకులు కల్పన, ఏఎంవో సుధాకర్, ప్రథమ్ జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యపడుతుందని మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ ఎ.చంద్రకళ సూచించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని స్కూల్‌లో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.

అలరించిన పార్వతీ కళ్యాణం

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మ్యూజిక్, డాన్స్ అకాడమీ, మావుడూరు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం బాపూజీ కళామందిరంలో పార్వతీ కళ్యాణం హరికథను ఏర్పాటు చేశారు. యండమూరి శిఖామణి ఈ కథను గానం చేశారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, బండారు చిట్టిబాబు, డాక్టర్ సోమేశ్వరరావు, మావుడూరు శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

ఆమదాలవలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యత అని ఎంఈవో జి.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం చిన్నకృష్ణాపురం పాఠశాలను ఎంఈవో తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

కొరియాలో మెరిసిన సిక్కోలు కుర్రాళ్లు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన తైక్వాండో క్రీడాకారులు దక్షిణ కొరియాలో శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. గత నెల 11న శ్రీకాకుళం క్రీడాకారులు కొమర మోహన్ కృష్ణ, కారె మోక్షిత్, కారే సాక్షిత్‌లు కొరియాలోని కుక్కివన్‌లో మెరుగైన శిక్షణకు వెళ్లి జిల్లాకు తిరిగి వచ్చారు. వీరికి శుక్రవారం విశాఖ ఎయిర్‌పోర్టులో తైక్వాండో ప్రతినిధులు స్వాగతం పలికారు.

వేడుకగా సింహద్వారం ప్రతిష్ఠ

ఇచ్ఛాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బూర్జపాడు గ్రామంలో గల శ్రీఉమామహేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రహదారిలో శుక్రవారం సింహద్వారాన్ని ప్రతిష్ఠించారు. స్థానికులు శివంగి మోహనరావు, పుణ్యవతి దంపతులు దీన్ని నిర్మించారు. ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. బూర్జపాడు, సున్నాపురం, అల్లటిపురం గ్రామ భజగోవింద భక్తులతో హరేరామ, హరేకృష్ణ కార్యక్రమం నిర్వహించారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

ఎచ్చెర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఆర్జీయూకేటీ, క్యాంపస్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఎం.తేజేశ్వరరావు, కె.డార్విన్, పి.శైలేష్‌బాబు జాతీయ స్థాయి పారా యోగా పోటీలకు ఎంపికయ్యారు. యోగాసన స్పోర్ట్స్, ఆంధ్రప్రదేశ్ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో ఈ విద్యార్థులు 2, 3, 6 స్థానాల్లో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఢిల్లీలో డిసెంబరు 2, 3 తేదీల్లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు.

నిధుల్లేవు.. నిర్వహణా లేదు

● పంచాయతీలపై నిర్వహణ భారం ● ఇదీ జిల్లాలో చెత్త సంపద కేంద్రాల పరిస్థితి



చిన్నకొజ్జిరియాలో వినియోగానికి నోచుకోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

కంచిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెత్త సంపద కేంద్రాల నిర్వహణకు నిధులు లేకపోవడంతో నిర్వహణ నీరుగారుతోంది. పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చాలన్న ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఉపాధిహామీ పథకానికి అనుసంధానంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పంచాయతీల్లో స్థలాలు కేటాయించి, ఒక్కో కేంద్రానికి సుమారుగా ఆరు నుంచి ఎనిమిది లక్షల రూపాయలతో నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 80 శాతానికిపైగా షెడ్ల నిర్మాణం పూర్తికాగా, కొన్నిచోట్ల నిర్మాణదశలో, మరికొన్ని స్థల సేకరణ దశలో ఉన్నాయి.

ఇదీ పరిస్థితి..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురంలో 21కిగాను 15 పూర్తయ్యాయి. సోంపేట మండలంలో 23కి గాను 22 కేంద్రాలు, కవిటి మండలంలో 23 పంచాయతీలకుగాను 15 కేంద్రాలు నిర్మాణం పూర్తయ్యాయి. పలాస సబ్ డివిజన్ పరిధిలో 232కిగాను 177 పూర్తయ్యాయి. ఈ కేంద్రాలను కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించినా పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా ఆదాయం లభించడంలేదు. దీనికితోడు వీటి నిర్వహణ పంచాయతీలకు భారంగా మారుతోంది. ప్రతి పంచాయతీలో వెయ్యి ఇళ్లకు ఒక గ్రీన్ అంబాసిడర్‌ను నియమించి, ప్రజల నుంచి తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేశారు. సేకరించిన చెత్తను వేరుచేసి, కంపోస్టు ఎరువుగా తయారుచేసి విక్రయించి ఆదాయం సంపాదించాలని భావించారు. అయితే నిర్మాణాలు పూర్తికాకపోవడం, నిర్వహణ లోపం వెరసి చెత్త సేకరణ జరగక, కేంద్రాల లక్ష్యం అటకెక్కింది. టీడీపీ హయాంలో ఏర్పాటుచేసిన ఈ కేంద్రాలను వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహణపై నిర్లక్ష్యం చూపడంతో మూలకుచేరాయి. పంచాయతీలకు నిధులు మంజూరుచేయకపోవడంతో కేంద్రాలు దిష్టిబొమ్మల్లా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెత్తసంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకువస్తారన్న ఆశలు నెలకొన్నాయి. కాగా కంచిలి మండలంలోని 31కి 21 కేంద్రాల పనులు పూర్తయ్యాయని ఎంపీడీవో వి.తిరుమలరావు తెలిపారు. ఆరు నిర్మాణదశలో ఉన్నాయని, ఒక కేంద్రానికి స్థలం లభ్యం కాలేదని చెప్పారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

జిల్లాలో శుక్రవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతిచెందారు. రోడ్డు ప్రమాదంలో ఒకరు, పాముకాటేయడంతో మరొకరు మృతిచెందారు. దీపం అంటుకోగా కాలిపోయిన ఘటనలో ఓ మహిళ చికిత్సపొందుతూ మృతిచెందింది.

వ్యాన్‌ను ఢీకొని యువకుడు..



అప్పన్న (ఫైల్)

కోటబొమ్మాళి,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ పరిధిలోగల చిన్న హరిశ్చంద్రపురం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జర్జంగి గ్రామానికి చెందిన బోనే అప్పన్న (28) మృతి చెందాడు. అప్పన్నతోపాటు మరో ఇద్దరు యువకులు ఉమ్మిలాడ బీచ్‌కు వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్నా రు. చిన్నహరిశ్చంద్రపురం వద్ద మలుపులో ఎదురుగావస్తున్న వ్యాన్‌ను ఢీకొనడంతో అప్పన్న అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పన్నకు భార్య లక్ష్మి, కుమా రుడు అభిరాం (4), కుమార్తె హారిక (3)తల్లిదండ్రులు జగ్గారావు, ఉత్తరమ్మలు ఉన్నారు. జగ్గారావు లారీ డ్రైవర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పన్న మృతితో కుటుంబం రోడ్డున పడిందని కుటుంబసభ్యులు, బంధువులు రోదిస్తున్నారు. ఈ ప్రమాదంపై సమాచారం రాలేదని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ఇంట్లో దీపం అంటుకొని మహిళ..



కుందు గురమ్మ (ఫైల్)

గార, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బందరువానిపేటకు చెందిన కుందు గురమ్మ (60) ఇంట్లో దీపం అంటుకొని శరీరం కాలిపోవడంతో మృతిచెందింది. ఎస్ఐ ఆర్‌జనార్దన్, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గురమ్మ గురువారం దేవుని వద్ద దీపం వెలిగించగా ప్రమాదవశాత్తు చీరకు దీపం అంటుకొంది. దీంతో శరీరం కాలిపోతుండగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. గురమ్మ భర్త సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గురమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పాముకాటుతో ఒకరు..

బూర్జ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటవాడలో శుక్రవారం పాము కాటుకు గురై కొత్తకోట హరీష్ (25) మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. హరీష్ శుక్రవారం ఉదయం పంట పొలంలో యంత్రంతో చేను కోస్తుండగా పాము కాటు వేసింది. దీంతో పాలకొండ ఆసుపత్రికి తరలించగా హరీష్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. హరీష్‌కు తల్లి పద్మావతి, తండ్రి సింహాచలంతోపాటు ఇద్దరు అక్కలు ఉన్నారు. కుమారుడు మరణించడంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయామని తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

కారును ఢీకొన్న లారీ

● బెలూన్లు తెరచుకోవడంతో సురక్షితంగా బయటపడిన ఓ కుటుంబం

కంచిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాడుపుడి జాతీయరహదారి సమీపంలో శుక్రవారం ఉదయం విశాఖ నుంచి పూరి వైపు వెళ్తున్న కారును, వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో విశాఖ నుంచి పూరి వెళ్తున్న మదురైకి చెందిన సత్తివేల్ నభిరాజ్‌తోపాటు ఆయన ముగ్గురు కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. ఉద్యోగ రీత్యా విశాఖలో ఉంటున్న సత్తివేల్ కుటుంబం, పూరి జగన్నాథ స్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం ఉదయం కారులో బయలుదేరారు. జాడుపుడి సమీపంలో కారును, లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు ఎదురుగా ఉన్న సీసీ కెమెరా స్తంభానికి ఢీకొని పల్టీ కొట్టగా బెలూన్లు తెరచుకోవడంతో అందరూ ప్రాణాలతో బయటపడ్డారు. వారికి తెలుగు రాకపోవడంతో స్థానికంగా ఉన్న అయ్యప్ప మాలధారణ చేసిన ధర్మాయాదవ్ వారితో మాట్లాడి, సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై కంచిలి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేశారు.

లారీ వెనుక భాగం తగలడంతో..

పలాస రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలం పాత జాతీయరహదారి గరుడఖండి-గోపాలపురం మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వజ్రపుకొత్తూరు మండలంలోని మహాదేవపురం గ్రామానికి చెందిన అప్పలస్వామి, కృష్ణ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా లారీ వెనకభాగం వారికి తగలడంతో వీరికి గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కిరాణా షాపులో చోరీ

● ఆనవాళ్లు గుర్తుపట్టకుండా ఉండేందుకు కారం చల్లిన వైనం

టెక్కలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టెక్కలి పాతజాతీయరహదారి పాలకేంద్రం సమీపంలో చిరంజీవి కిరాణాషాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో అరతులం బంగారం, రూ.80వేలు నగదు దొంగిలించినట్లు యజమాని అంధవరపు బాలకృష్ణ పోలీసులకు సమాచారం అందించారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు వెనుక షట్టర్ తలుపులు పగులగొట్టి కిరాణాషాపులోకి చొరబడ్డారు. షాపులో ఉన్న రూ.80వేలు నగదుతో పాటు పిల్లలకోసం కొనుగోలుచేసిన అరతులం బంగారు ఆభరణాలు దొంగిలించారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు క్లూస్‌టీమ్ బృందానికి, పోలీస్ డాగ్స్‌కుఆనవాలు గుర్తుపట్టకుండా ఉండేందుకు షట్టర్ దగ్గర, క్యాష్‌కౌంటర్ ప్రాంతంలో వారు తెచ్చుకున్న కారాన్ని చల్లడం విశేషం. కాగా సంబంధిత కిరాణా షాపు యజమాని విషయం తెలియజేశారని, ఇంకా కేసు నమోదు చేయలేదని టెక్కలి ఎస్ఐ రాము తెలిపారు.

ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి: ఎస్పీ



ఫిర్యాదుదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మహేశ్వరరెడ్డి

పలాస, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ అధికారులను ఆదేశిస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మొత్తం 17 వినతులు వచ్చాయి.

మెళియాపుట్టిలో వాహనం ధ్వంసం

మెళియాపుట్టి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలో గురువారం రాత్రి జడ్పీ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ బి.చిన్నబాబు ద్విచక్ర వాహనం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ మేరకు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రమేష్‌బాబు పరిశీలించారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

కిడ్నీ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మాధవరావు

పలాస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో కిడ్నీ వ్యాధులపై ప్రభుత్వం స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పలాసలో విలేకరులతో మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిబారిన పడి అనేకమంది మరణిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో జె.వీరాస్వామి, ఎం.భీమారావు, టి.సరస్వతి, పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐతో లింక్ చేసుకోవాలి

టెక్కలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు పూర్తిచేసుకున్న వారంతా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో బ్యాంకుఖాతాలకు పోస్టాఫీసుల్లో లింక్‌చేసుకోవాలని టెక్కలి హెడ్‌పోస్టుమాస్టర్ ఎస్.తిరుపతిరావు ఒక ప్రకటనలో కోరారు. లింక్ చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయోజనాలకు అర్హత పొందుతారని తెలిపారు. ఈ సౌకర్యం టెక్కలి పోస్టాఫీస్‌లో 200 రూపాయలతో కల్పించినట్లు పేర్కొన్నారు.

పనులు పూర్తి చేశారు.. ప్రారంభం మరిచారు

●ఇదీ పొందూరులోని సీహెచ్‌సీ పరిస్థితి



పనులు పూర్తయిన ప్రభుత్వ ఆసుపత్రి భవనం

పొందూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొందూరు సీహెచ్‌సీ నూతన ఆసుపత్రి భవనం పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన పాత సీహెచ్‌సీ భవనం శిథిలావస్థకుచేరింది. దీంతో గత ప్రభుత్వం హయాంలో రూ 4.70 కోట్లతో ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే అప్పట్లో నిధులు పూర్తిస్థాయిలో మంజూరు కాకపోవడంతో నిర్మాణం పూర్తికాలేదు.ఇటీవల కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీఎంఐడీసీ అధికారులు పనులను వేగవంతంచేసి ఆసుపత్రి భవనాలను సిద్ధంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కూనరవికుమార్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా గత ప్రభుత్వంలో నిర్మాణానికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ విషయాన్ని అధికారులుదృష్టికి తీసుకువెళ్లామని ఏపీఎంఐడీసీ డీఈ మణికుమార్ తెలిపారు. అలాగే ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్, అధికారులను కలిసినట్లు పొందూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.సుజాత చెప్పారు.

ఉపాధి పనులు పూర్తిచేయాలి: ఎమ్మెల్యే



పలాస రూరల్:మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస రూరల్,నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులు అన్ని మండలాల్లో త్వరగా పూర్తి చేసి సకాలంలో బిల్లులు కాంట్రాక్టర్లకు అందేలా చర్యలు తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శుక్రవారం పలాస టీడీపీ కార్యాలయంలోపలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల తహసీల్దార్లు,ఎంపీడీవోలు, సచివాలయ అడ్మిన్లతో సమీక్షించారు. ఓబీసీ, కుల,ఆదాయ ధ్రువపత్రాలను సచివాలయ, రెవెన్యూ సిబ్బంది త్వరగా అర్జీదారులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, ఎంపీడీవో వసంత్‌కుమార్, వీఆర్వోల సంఘ మండలాధ్యక్షుడు కంచరాన ఖగేశ్వరనాయుడు పాల్గొన్నారు.

డైటీషియన్ పోస్టులు భర్తీ చేయండి

పలాస, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):పలాస కిడ్నీ ఆసుపత్రిలో ఫార్మసీ అధికారి, డైటీషియన్ పోస్టులు భర్తీ చేయాలని ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోసెల గోపాల్ కోరారు.ఈమేరకు పలాసలో ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం అందజేశారు. కాగా ఆర్టీసీ జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి ఎ.విజయ్‌కుమార్, పలాస డీఎం సీతారామ్‌నాయుడుతో ఎమ్మెల్యే సమీక్షించారు. అధికారులు సమన్వయంతో రద్దీగా ఉండేప్రాంతాల్లో బస్సు సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

టెక్కలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక హక్కులు, విధులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగిఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం టెక్కలిలోని ఆదీఆంధ్రా వీధిలో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర సంక్షేమ పాఠశాలలో జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని నిర్వహించారు.సమావేశంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వివేకానంద, హెచ్ఎం దుప్పాడఅప్పారావు, వసతిగృహ సంక్షేమాధికారి గణపతి, ఏఎస్ఐ కేశవరావు ఉన్నారు.

పంచాయతీ ప్రణాళికలపై దృష్టి సారించండి

టెక్కలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి కోరారు. శుక్రవారం టెక్కలిలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో అబ్జర్వర్ కృష్ణమోహన్, డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ, డీఎల్‌పీవో ఆర్.గోపీబాల, ఈవోపీఆర్‌డీ సింహాద్రి, కె.నాగరాజు, ప్రసాద్, లోకనాథం పాల్గొన్నారు.

తీర్మానం లేకుండా జీతాలు ఎలా పెంచుతారు?

నరసన్నపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తీర్మానం లేకుండా కొత్తగా పారిశుధ్య కార్మికులకు ఎలా జీతాలు పెస్తారని, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు కొంత మొత్తం ఎందుకు తీసుకుంటున్నారని వార్డు సభ్యులు ప్రశ్నించారు. శుక్రవారం నరసన్నపేటలో పంచాయతీ పాలకమండలి సమావేశం నిర్వహించారు. పంచాయతీ నిధులతో చేపడుతున్న పలు కార్యక్రమాలు పాలకమండలి ఆమోదం లేకుండా ఏవిధంగా చేస్తారని సభ్యులు ప్రశ్నించారు. గతంలో నీటి కుళాయికోసం డబ్బులు కట్టిన వారికి కొత్త కలెక్షన్లు ఇవ్వకుండా ఎందుకు కార్యాలయాలు చుట్టూ తిప్పుతున్నారని ప్రశ్నించారు. సర్పంచ్ శంకరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు,ఈవో ద్రాక్షాయిణి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పెంటూరులో తాటిపోలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



బూరెల కోసం ఎదురుచూస్తున్న మహిళలు

నందిగాం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పెంటూరులో తాటిపోలమ్మ తల్లి మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం జరిగింది. గ్రామస్థుల ఆధ్వర్యంలో పురోహితులు రేజేటి బోసుబాబు, ఎం.రమేష్‌శర్మ, రుత్వికుల పర్యవేక్షణలో మందిర ప్రాంగణంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.ఈ సందర్భంగా సామూహిక కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. మందిరం గోపురంపై నుంచి బూరెలు వదలడంతో మహిళలు వాటి కోసం పోటీపడ్డారు.

అల్లిమెరకలో చింతల పోలమ్మ..

హరిపురం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి):మందస మండలంలోని అల్లిమెరకలో శుక్రవారం చింతలపోలమ్మ ఆలయం ప్రారంభంతోపాటు విగ్రహాన్ని బ్రహ్మశ్రీ రాజేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు.అనంతరం విగ్రహం ఊరేగించి అమ్మవారికి పసుపు, కుంకుమ, ముర్రాటలతో చల్లడం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గొరకల జానకిరావు, పవన్, గోపి, పురుషోత్తం, పున్నయ్య, మూర్తి, ధర్మారావు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారం సేకరించాలి



మాట్లాడుతున్న మంచు కరుణాకరరావు

పాతపట్నం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): పశుగణనకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని సేకరించాలని పశు సంవర్ధకశాఖ సహాయసంచాలకుడు మంచు కరుణాకరరావు కోరారు. శుక్రవారం పాతపట్నం ప్రాంతీయ పశు వైద్యశాలలో 21వ అఖిలభారత పశుగణనపై శిక్షణ నిర్వహించారు. కార్య క్రమంలో కొరసవాడ పెద్దలోగిడి పశువైద్యాధికారులు పి.అనిల్, కె.మౌనిక, పాతపట్నం మెళియాపుట్టి మండలాల ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

జలుమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో కె.అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలోఉల్లాస్ కార్యక్రమంపై సమావేశం నిర్వ హించారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు, ఏపీఎం శేఖర్ పాల్గొన్నారు.

●కొత్తూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ పథకాన్ని రూపొందించినట్లు ఏవో బీవీఆర్. ప్రసాదరావు తెలిపారు.కొత్తూరు ఎంపీడీవో కార్యా లయంలో సమాజంలో అందరికీ జీవితకాల అభ్యసన అవగాహన పేరుతో వలంటీర్లకు మండల స్థాయి శిక్షణ తరతులు నిర్వహించారు.

భూసమస్యల పరిష్కారాలకే గ్రామసభలు

పాతపట్నం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ డీటీ సునీల్ తెలిపారు. శుక్రవారం ప్రహరాజపాలెంలో నిర్వహించిన గ్రామసభలో 87 దరఖాస్తులు అందాయని తెలిపారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

కోటబొమ్మాళి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని 104 సిబ్బంది కోట రమణమూర్తి, తదితరులు కోరారు.ఈ మేరకు తహసీల్దార్ అప్పలరాజుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు.

● కొత్తూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగులు కోరారు.ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఏవో రాంబాబుకు 104 సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మాన కిరణ్, కె.వెంకటేష్, కె.గుణాకర్ వినతి పత్రం అందజేశారు.

రబీలో అపరాల సాగుతో అధిక లాభాలు

జలుమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రబీలో అపరాలు సాగు వల్ల తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీ కె.రవీంద్రభారతి తెలిపారు. శుక్రవారం చల్లవానిపేట ప్రాంతంలో రబీలో సాగుచేసే అపరాలు పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు మినుము విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చల్లవానిపేట సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, ఏవో కె.సురేష్, వీఏఏ రాజశేఖర్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వే సకాలంలో పూర్తి చేయాలి

పలాస, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వే సకాలంలో పూర్తి చేయాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు కోరారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్లు, ప్లానింగ్ అధికారులు, ఎనిమిటీస్, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో డ్రోన్ల సహాయంలో నిర్వహించిన సర్వేఆగిపోవడంతో ప్రభుత్వం పునఃప్రారంభించాలని ఆదేశించినట్లు తెలిపారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి: సీఐ

వజ్రపుకొత్తూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని బావనపాడు మెరైన్ సీఐ డి.రాము కోరారు. శుక్రవారం పాతటెక్కలిలో విద్యార్థులకు డ్రగ్‌రహిత సమాజంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పెచ్చులూడి.. బీటలు వారి..

●భయాందోళనతో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ● ఇదీ మెళియాపుట్టి ఎంపీడీవో కార్యాలయం పరిస్థితి



సమావేశం గదిలో పెచ్చులూడుతున్న దృశ్యం

మెళియాపుట్టి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి ఎంపీడీవో కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరింది. నిర్మించిన తర్వాత కనీస మరమ్మతులు లేకపోవడంతో శ్లాబు పెచ్చులూడుతోంది. గోడలు, పిల్లర్లు బీటలు వారుతున్నాయి. దీంతో క్షణంలో పెచ్చులు తమపై పడతాయోనని విధులు నిర్వహిస్తున్న సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. వైసీపీ హయాంలో అధికారులతో సమీక్షలు లేకపోవడంతో ఎంపీడీవో కార్యాలయం వైపు ఎవరూ కన్నెత్తిచూసేవారు కాదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీవ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవడంతో తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో కార్యాల యం శిథిలావస్థలో ఉండడంతో ఐకేపీ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. మండల సర్వసభ్యసమావేశాలు సైతం ఐకేపీ కార్యాలయంలోనే మూడేళ్లుగా నిర్వహిస్తున్నారు. కాగా ప్రతి రోజూ భయపడుతూ విధులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ప్రసాద్‌పండా తెలిపారు. సమావేశాలను ఇతర శాఖల కార్యాలయాల్లో ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. అన్ని గదుల శ్లాబులు పెచ్చులూడి రాలుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నామని తెలిపారు.

విద్యార్థికి ఆర్థికసాయం

సంతబొమ్మాళి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకరాపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతి చదువుతన్న ఎం.అజయ్ కుమార్ కిడ్నీ వ్యాధి బారిన పడడంతో ఉపాధ్యాయులు అండగా నిలిచారు. ఈమేరకు మండలంలోని ఉపాధ్యాయులంతా రూ.70 వేలు విరాళాలు సేకరించి కుటుంబసభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హెచ్.శివప్రసాద్, కె.వెంకటరమణమూర్తి కె.పాపారావు పాల్గొన్నారు.

డిపాజిట్ల సేకరణపై అవగాహన

నందిగాం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దిమిలాడ పీఏసీఎస్ పరిధిలోగల నర్సిపురంలో శుక్రవారం పర్సన్‌ఇన్‌చార్జి వి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో డిపాజిట్ల సేకరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార బ్యాంక్ డీజీఎం సీహెచ్ బసవలింగం నాబార్డు సౌజన్యంతో బ్యాంకు అందజేయనున్న వివిధ కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, టెక్కలి డీసీసీబీ మేనేజర్ ఎ.దినమని, ఎస్‌వో వై.తులసి, ఎస్‌డీఎల్‌సీవో రవికుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, టీడీపీ నాయకులు మళ్ల బాలకృష్ణ,సర్లాన భాస్కరరావు, సీఈవోలు పి.శ్రీనుబాబు, అప్పన్న పాల్గొన్నారు.

పెన్షన్ సొమ్ము జమచేయాలి

నందిగాం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ సొమ్ములు జమచేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు టి.వైకుంఠరావు ఒక ప్రకటనలో కోరారు. నెల మొదటి వారం పూర్తయినా సొమ్ములు జమకాకపోవడంతో ఇబ్బందిపడుతున్నట్లు తెలిపారు.

24,25 తేదీల్లో విద్య, వైజ్ఞానిక మహాసభలు



మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

హరిపురం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): హరిపురంలో ఈనెల 24, 25 తేదీల్లో యూటీఎఫ్ జిల్లా విద్య, వైజ్ఞానిక మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం హరిపురంలో సంఘ మందస మండలాధ్యక్షుడు జగదీష్ బడిత్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలోమాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు వైకుంఠరావు, రమేష్, కోదండరావు, సోమేశ్వరరావు, రమణబాబు, కిరణ్,జయరాం పాల్గొన్నారు.

ఏపీఎంగా ప్రసాదరావు

వజ్రపుకొత్తూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు ఏపీఎంగా జి.ప్రసాదరావు నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన మందస నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

రాష్ట్రంలో నియంత పాలన

కోటబొమ్మాళి,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నియంత పాలన జరుగుతోందని టెక్కలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆరోపించారు. శుక్రవారం కోటబొమ్మాళిలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో వివిధ కార్యాలయాలు, పాఠశాలల్లో పని చేస్తున్న 400 మంది చిరు ఉద్యోగులను తొలగించారని ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అవి సోషల్ మీడియాల్లో ప్రజలకు వివరిస్తున్న వైసీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు రోణంకి మల్లయ్య, పేడాడ వెంకటరావు, బోయిన నాగేశ్వరరావు, దుక్క రామకృష్ణ, నూక సత్యరాజు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

నరసన్నపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను పరిరక్షించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. శుక్రవారం నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తల్లిపాల కేంద్రాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ, కె.శ్రీనివాసరావు, ఎంఈవో ఉప్పాడ శాంతారావు, ఐసీడీఎస్ పీవో నాగమణి, ఎం.వాసుదేవకుమార్, ఆర్టీసీ మెకానికల్ సూపరింటెండెంట్ కె.రామారావు, ఎంపీడీవో బి.మధుసూదనరావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వి.జయశంకర్ పాల్గొన్నారు.